

వచ్చే నెల 7 నుంచి భీమేశ్వరుని దర్శనం

ద్రాక్షారామలో 5, 6 తేదీల్లో సంప్రోక్షణ కార్యక్రమాలు
ఈ నెల 20తో పూర్తికానున్న సంరక్షణ, అభివృద్ధి పనులు

- వివరాలు 7లో



- రబీ ధాన్యం అమ్మి 65 రోజులైనా ఇంకా చేతికందని సొమ్ము
- జిల్లాలో రైతులకు 154.65 కోట్ల బకాయిలు
- తీసుకున్న పంట రుణాలు చెల్లించాలని బ్యాంకర్ల ఒత్తిడి
- ఆర్థిక ఇబ్బందుల్లో అన్నదాతలు

ఖరీఫ్‌కు పెట్టుబడెలా!

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు అమ్మిన ధాన్యం సొమ్ములు చేతికి అందక రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఒకపక్క సాగు కోసం బ్యాంకుల్లోను, ప్రైవేటు ఫైనాన్సర్ల వద్ద తెచ్చిన అప్పులు తిరిగి చెల్లించేందుకు చేతిలో సొమ్ములు లేక... మరోపక్క ఖరీఫ్ సాగుకు పెట్టుబడికి సొమ్ములు లేక అన్నదాతలు అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అయితే మద్దతు ధర లభిస్తుందని ఎంతో ఆశపడి పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించారు. ఆ ధాన్యం సొమ్ములు చేతికి రావడంలో తీవ్ర జాప్యం చోటుచేసుకోవడంతో ఎన్నో పాట్లు పడుతున్నారు.

ముమ్మిడివరం, జూలై 16: ఖరీఫ్ సీజను మొదలు కావడంతో దమ్ములు, కూలీలు, ఎరువులకు సొమ్ములు లేక రైతులు ప్రైవేటు ఫైనాన్సర్ల చుట్టూ తిరుగుతున్నారు. అంతేగాక తీసుకున్న పంట రుణాలు తిరిగి చెల్లించాలని బ్యాంకర్లు ఒత్తిడి తెస్తున్నారు. ఎన్నికలు జరిగి ప్రభుత్వం మారడంతో బకాయి సొమ్ములు సకాలంలో విడుదల కాలేదు. ఏప్రిల్ 29 తర్వాత రైతులు విక్రయించిన ధాన్యం సొమ్ములు పడలేదు. కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వం జూలై 3న రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి రూ.వెయ్యి కోట్లు విడుదల చేసింది. అందులో జిల్లాకు రూ.117కోట్లు వచ్చాయి. మే 9వ తేదీ వరకు జరిగిన కొనుగోళ్లకు సంబంధించి చెల్లింపులు జరిగాయి. మే 9వ తేదీ ముందు అమ్మిన వారిలో కొంతమంది వేలిముద్రలు సరిగా వేయకపోవడంతో వారికి కూడా సొమ్ములు అందలేదు. జిల్లాలో 19,883 మంది రైతులకు సంబంధించి (28,391 ఫండ్ ట్రాన్స్‌ఫర్ ఆర్డర్) 1,63,023.400 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని పౌరసరఫరాల శాఖ కొనుగోలు చేసింది. ఇప్పటివరకు 15,196 ఎఫ్‌టీవోలకు రూ.201.23 కోట్లు చెల్లించారు. ఇంకా రైతులకు 13,195 ఎఫ్‌టీవోలకు సంబంధించి రూ.154.65 కోట్లు చెల్లించవలసి ఉంది. రైతులు ధాన్యం అమ్మి సుమారు 65 రోజులు అయినా వారికి ఇంకా సొమ్ములు జమకాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.

గత రబీలో ఎఫ్‌టీయూ-1121, ఎంటీయూ-3626 రకాలు సాగు చేశారు. 3626 రకం కొనుగోలుకు మిల్లర్లు ఎక్కువగా మొగ్గుచూపుతున్నారు. ఎంటీయూ-3626, ఎంటీయూ-1121 కొనుగోలు చేశారు. మిల్లర్లు కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి వారంలో రైతులకు సొమ్ములు చెల్లించారు. ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించిన ధాన్యానికి మాత్రం సొమ్ములు రాలేదు. జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్‌లో 1,68,780 ఎకరాల్లో వరి సాగు చేపట్టారు. వీరిలో ఎక్కువ మంది కౌలు రైతులు ఉన్నారు. ఖరీఫ్ సాగు పెట్టుబడులకు సొమ్ములు లేక ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలకు సొమ్ముల కోసం తిరుగుతున్నారు. అయితే వారి ఖాతాలకు డబ్బు జమ కాకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. పౌరసరఫరాల శాఖ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తమ నుంచి కొనుగోలుచేసిన ధాన్యానికి సంబంధించి వెంటనే సొమ్ములు జమ చేయాలని రైతులు కోరుతున్నారు.

ధాన్యం అమ్మి 65 రోజులైంది

చొల్లంగి సత్యనారాయణ, కౌలు రైతు, సూరాయిచెరువు



ఎంటీయూ-1121 వరి రకాన్ని మూడు ఎకరాల్లో సాగు చేశాను. పండిన ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రానికి అమ్మి 65 రోజులైంది. ఆ సొమ్ములు ఇంకా అందలేదు. ఖరీఫ్ సాగుకు పెట్టుబడి పెట్టడానికి డబ్బు లేక ఇబ్బందిపడుతున్నాం. రబీ సాగుకు బయటతెచ్చిన అప్పులు తీర్చడానికి సొమ్ము లేదు. ఖరీఫ్ ఎలా సాగు చేయాలో తెలియట్లేదు.

ధాన్యం సొమ్ములు వెంటనే చెల్లించాలి

కొప్పిశెట్టి వెంకటేశ్వరరావు, కౌలు రైతు, అయినాపురం



రబీలో అమ్మిన ధాన్యానికి ఇంకా సొమ్ములు రాలేదు. ఎడు ఎకరాలు కౌలుకు చేస్తున్నాను. రబీ మాసూళ్లు అయి రెండు నెలలు పూర్తయ్యింది. పండిన ధాన్యాన్ని ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రంలో విక్రయించాను. ఇప్పటికీ సొమ్ములు రాలేదు. రైతు భరోసా కేంద్రానికి వెళితే ఈవేళ, రేపు వస్తుందంటున్నారు. ఖరీఫ్ నాట్లు ఎలా వేయాలో తెలియట్లేదు. చేతిలో సొమ్ములు లేక ఇబ్బందిపడుతున్నా.



చీరల చోరులెవరో!

- బండారులంక చేనేత సహకార సంఘంలో రూ.3 లక్షలు విలువైన చీరలు మాయం
- అర్ధ సంవత్సర లెక్కలు చూస్తుండగా బయటపడ్డ వ్యవహారం
- 2023 ఏప్రిల్ నుంచి 15సార్లు జరిగినట్టు గుర్తించిన అధికారులు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన చేనేత, జౌళి శాఖ అధికారి, సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి గౌరీశంకరరాజు

అమలాపురం రూరల్, జూలై 16: బండారులంక చేనేత సహకార సంఘంలో రూ.3 లక్షలు విలువైన చీరలు మాయమయ్యాయి. సహకార బ్యాంకు అడిగిన అర్ధ సంవత్సరం లెక్కలు చూస్తుండగా ఈ వ్యవహారం బయటపడింది. చీరలు మాయమైన వ్యవహారంపై చేనేత, జౌళి శాఖ అధికారులు అమలాపురం తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. గతవైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆ పార్టీ నాయకులకే సొసైటీల అధికారపగ్గాలను కమిటీలుగా అప్పగించారు. దాంతో అప్పటివరకు సొసైటీలో దశాబ్దాల కాలంగా పనిచేస్తున్న సిబ్బందిని తొలగించి కొత్తవారిని నియమించుకున్నారు. అదే కోవలో గ్రామానికి చెందిన పిల్లి డింపుల్‌లక్ష్మీసరస్వతిని ప్రొడక్షన్ క్లర్క్‌గా నియమించారు. సొసైటీ వస్త్ర నిల్వల గొడౌన్ తాళాలు ఆమె వద్దే ఉంటాయి. కొంతకాలం పాటు సొసైటీలో ఏ విధమైన అవకతవకలు జరగలేదు. 2023 ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు 15 పర్యాయాలు గొడౌన్‌లో చీరలు మాయమైనట్టు సొసైటీ కార్యదర్శి కరెళ్ల నాగరాజు అర్ధ సంవత్సర వార్షిక లెక్కల్లో గుర్తించారు. సొసైటీలో మాయమవుతున్న చీరల లెక్కలు బయటపడకుండా రెండు రకాల రిజిస్టర్లను ఏర్పాటు చేసినట్టు గుర్తించారు. ఒక రిజిస్టర్‌లో సొసైటీలో ఉన్న వస్త్ర నిల్వల యథార్థ లెక్కలు రాశారు. రెండో రిజిస్టర్‌లో మాత్రం తమకు అనుకూలంగా వస్త్ర నిల్వల లెక్కలు రాస్తూ అప్పుడప్పుడూ ఆయా వస్త్ర నిల్వల రికార్డులను వైట్‌నర్‌తో మార్పులు చేసినట్టు గుర్తించారు. సమాచారం తెలుసుకున్న చేనేత, జౌళి శాఖ అధికారి, సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి మెట్టి గౌరీశంకరరాజు సొసైటీకి చేరుకుని సిబ్బందిని విచారించారు. సొసైటీలో రూ.3,06,080 విలువైన 456 చీరలు దశలవారీగా మాయమైనట్టు గుర్తించారు. సొసైటీ తాళాలను అప్పుడప్పుడు అదే సొసైటీలో పనిచేస్తున్న వ్యక్తికి ఇచ్చానని సరస్వతి చెప్పన్నట్టు అధికారులు తెలిపారు. వస్త్ర నిల్వలను ప్రొడక్షన్ క్లర్క్ ఒక్కరే మాయం చేశారా లేక మరెవరైనా చేయించారా అన్న విషయం తేలాల్సి ఉంది. ఈ ఘటనపై విచారణ జరిపి కేసు నమోదు చేస్తామని తాలూకా ఎస్‌ఐ వై.శేఖర్‌బాబు మంగళవారం తెలిపారు. సొసైటీలోని వస్త్ర నిల్వలను బాధ్యగా చూడాల్సిన కార్యదర్శి కె.నాగరాజు సమీపంలోని మరో రెండు సొసైటీలకు కార్యదర్శిగా పనిచేస్తుండడం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. నాగరాజు సొసైటీకి సక్రమంగా వెళ్లకపోవడం వల్ల పట్టించుకునే వారెవరూ లేక వస్త్ర నిల్వలను దశలవారీగా మాయం చేశారని కార్మికులు ఆరోపిస్తున్నారు.

రాష్ట్ర స్థాయి చెస్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎనిమిది మంది ఎంపిక...8లో

బహుముఖ అభివృద్ధిలో జాతీయ రహదారుల పాత్ర కీలకం

భూ సేకరణలో సమస్యలను అధిగమించాలి

ఎన్‌హెచ్ ఇంజనీర్లు, రెవెన్యూ సిబ్బందితో సమీక్షలో కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ప్రాంతాల మధ్య బహుముఖ అభివృద్ధిలో జాతీయ రహదారుల పాత్ర కీలకమని కలెక్టర్ రావిరాల మహేష్‌కుమార్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం జాతీయ రహదారులకు సంబంధించిన ఇంజనీర్లు, రెవెన్యూ సిబ్బందితో జిల్లాలో జరుగుతున్న రహదారుల పనులు, పెండింగు అంశాలపై కలెక్టర్ అధ్యక్షతన సమీక్షా సమావేశం నిర్వహించారు.జిల్లా అభివృద్ధిలో జాతీయరహదారులు కీలక పాత్ర పోషిస్తాయని వివరించారు. సరుకు రవాణా సదుపాయాలు మెరుగుపడడం ద్వారా జిల్లా అభివృద్ధికి అన్ని విధాలా ఆస్కారం ఏర్పడుతుందన్నారు. రోడ్డు భద్రతపై ప్రతినెలా అవగాహన సమావేశాలు నిర్వహించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించి మానవ జీవితాలకు రక్షణ కల్పించాలన్నారు. జిల్లాలో జాతీయ రహదారుల విస్తరణకై ప్రతిపాదించిన భూ సేకరణ పనులను వేగవంతం చేసి రవాణా సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు.

జిల్లాలో 216-ఎ జాతీయ రహదారి పాశర్లపూడి-దిండి రోడ్డు విస్తరణ, ఈతకోట వద్ద టోల్‌ప్లాజా విస్తరణకు భూసేకరణ, నర్సాపురం-దిండి బైపాస్ రోడ్డుకు 14 కిలోమీటర్ల మేర భూసేకరణ చేయాల్సి ఉందన్నారు. జాతీయ రహదారులు, రోడ్డు రవాణా రహదారుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 216-ఎ రోడ్డును యానాం నుంచి దిండి వరకు మొదటి ప్యాకేజీ విస్తరణ పనులు 2022 నవంబరులో పూర్తయ్యాయన్నారు. రెండో ప్యాకేజీ దిండి నుంచి ప్రారంభమై పసలపూడి వద్ద భూసేకరణకు సంబంధించి భూస్వాముల నుంచి ఎదురవుతున్న ఇబ్బందులను పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్‌కు సూచించారు. రోడ్ల విస్తరణ అనంతరం సంబంధిత కాంట్రాక్టర్లు రోడ్డు నిర్వహణతో పాటు



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

రోడ్డుకు ఇరువైపులా ప్లాంటేషన్ డెవలప్ చేయాలన్నారు. జాతీయ రహదారులపై ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను బ్లాక్ స్పాట్‌లుగా గుర్తించి ప్రమాదాల నివారణకు భద్రతా చర్యలు పటిష్ఠం చేయాలన్నారు. ఎక్కడైనా రోడ్డు అలైన్‌మెంట్‌లో మార్పులు జరిగాయా, తుఫాను సమయంలో ఎక్కడైనా రహదారులు దెబ్బతిన్నాయా తదితర వివరాలను ఆయా శాఖల అధికారులను అడిగి తెలుసుకున్నారు. పాశర్లపూడిలో భూసేకరణలో ఉన్న అభ్యంతరాలను సంప్రదింపుల ద్వారా పరిష్కరించి ముందడుగు వేయాలన్నారు. శివకోడులో నష్టపరిహారం చెల్లింపులో ఉన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. జాతీయ రహదారి 16-ఎకు సంబంధించి జొన్నాడ వద్ద, రావులపాలెం వద్ద ఇతర ప్రాంతాలతో కలిపి 11 జంక్షన్లు ఉన్నాయని, వాటిని బ్లాక్ స్పాట్‌లుగా గుర్తించి భద్రతా పరంగా పటిష్టమైన చర్యలుతీసుకోవాలన్నారు. ప్రమాదాల నివారణలో భాగంగా మడికి, చేముడులంక, చొప్పెల్ల గ్రామాలకు సంబంధించి మూడు కిలోమీటర్ల మేర సర్వీసు రోడ్డు నిర్మించేందుకు టెండర్లు పిలిచామన్నారు. జొన్నాడ జంక్షన్ వద్ద ఫ్లై ఓవర్ నిర్మాణ పనులను నవంబరు నాటికి పూర్తి చేయాలని కాంట్రాక్టరుకు సూచించారు.

రావులపాలెం జంక్షన్‌లో ఫ్లై ఓవర్ నిర్మాణానికి ప్రతిపాదించిన స్థలాన్ని స్వయంగా పరిశీలించి తగు చర్యలు తీసుకుంటానని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈతకోట టోల్‌ప్లాజా వద్ద శాశ్వత భవనాలు, మౌలిక వసతుల కల్పనకు భూసేకరణ చేపట్టామన్నారు. తరచుగా ప్రమాదాలు సంభవిస్తున్న రావులపాలెం మల్లయ్యదొడ్డి జాతీయ రహదారిపై ఇసుక లారీలను పార్కింగ్ చేయకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. నర్సాపురం-దిండి రోడ్డు విస్తరణ భూసేకరణ ప్రక్రియను పూర్తిచేసి టెండరు దశలో ఉన్న ప్రాజెక్టును ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్‌అజయ్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ పీడీ సాయిశ్రీనివాస్, కార్యనిర్వాహక ఇంజనీర్ ఇశ్రీనివాస్, పథక సంచాలకుడు డి.సురేంద్రనాథ్, ఆర్డీవోలు జి.కేశవర్ధనరెడ్డి, జీవీవీ సత్యనారాయణ, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ బి.రాము, తహసీల్దార్లు పాల్గొన్నారు.



ఎస్పీ శ్రీధర్‌కు విగ్రహాన్ని బహూకరిస్తున్న డీఎస్పీలు

కోనసీమతో ఎనలేని అనుబంధం

- ట్రైనీ డీఎస్పీగా ఇక్కడే చేరి ఎస్పీగా పనిచేశా
- వీడ్కోలు సత్కార సభలో శ్రీధర్

అమలాపురం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కోనసీమతో తనకు ఎనలేని అనుబంధం ఉందని ఎస్పీ ఎస్.శ్రీధర్ పేర్కొన్నారు. తొలుత ట్రైనీ డీఎస్పీగా, ఆ తర్వాత అమలాపురం సబ్ డివిజనల్ పోలీసు అధికారిగా, ఇప్పుడు ఎస్పీగా కోనసీమలోనే పని చేశాను.. అంటూ తనను సత్కరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు ఆయన. బదిలీపై వెళ్తున్న ఎస్పీ శ్రీధర్‌కు అమలాపురం సత్యనారాయణ గార్డెన్స్‌లో మంగళవారం జిల్లాకు చెందిన పోలీసు అధికారులు వీడ్కోలు సత్కారసభ నిర్వహించారు. తొలుత జిల్లా సాయుధ దళాలు కవాతు నిర్వహించి సాయుధ వందనం చేశాయి. ఎస్పీ శ్రీధర్ గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది, హోంగార్డులు, రెవెన్యూ అధికారులు, పాత్రికేయులు పూర్తి సహాయ సహకారాలు అందించారని కొనియాడారు. సక్సెస్‌ఫుల్ పోలీసు అధికారిగానే ఇక్కడి నుంచి బదిలీపై వెళుతున్నట్టు ఆయన తెలిపారు. ఎస్పీగా శ్రీధర్ అందించిన సేవలను అదనపు ఎస్పీ ఎస్.ఖాదర్‌బాషా, అమలాపురం, కొత్తపేట, రామచంద్రపురం డీఎస్పీలు మహేశ్వరరావు, కేవీ రమణ, రామకృష్ణ, ఏఆర్ డీఎస్పీ విజయసారథి కొనియాడారు. తొలుత ఎస్పీ శ్రీధర్‌ను ప్రత్యేక వాహనంపై ఉంచి పోలీసు అధికారులు తాళ్లతో లాగి వేదిక వద్దకు తోడ్కొనివచ్చారు. అనంతరం శ్రీధర్‌ను దుశ్శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎస్పీ కార్యాలయ పరిపాలనాధికారి, స్పెషల్ బ్రాంచి ఇన్‌స్పెక్టర్లు. డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.



ఎస్పీ శ్రీధర్ వాహనాన్ని తాళ్లతో లాగుతున్న పోలీసు అధికారులు

20న రామచంద్రపురంలో మెగా జాబ్‌మేళా

వీఎస్ఎం ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో 1,859 పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు.... హాజరుకానున్న 30 కంపెనీల హెచ్‌ఆర్‌లు

అమలాపురం టౌన్, జూలై 16: రామచంద్రపురం వీఎస్ఎం ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో ఈ నెల 20వ తేదీన మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. వివిధ కంపెనీలకు సంబంధించిన ఖాళీ పోస్టుల వివరాలను తెలియజేస్తూ ముద్రించిన కరపత్రాలు, పోస్టర్లను మంగళవారం కలెక్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30 కంపెనీల హెచ్‌ఆర్‌లు జాబ్‌మేళాకు హాజరై తమ సంస్థలకు అనువైన అభ్యర్థులను ఎంపిక చేసుకుంటారన్నారు. నిరుద్యోగులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దని, జాబ్‌మేళాలో ఎటువంటి రుసుము చెల్లించవలసిన అవసరం లేదని స్పష్టం చేశారు. నేరుగా వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకుని విద్యార్హతల ధ్రువపత్రాలతో జాబ్‌మేళాకు హాజరై ఉద్యోగాలు పొందాలన్నారు. వికాస పథక సంచాలకుడు కె.లచ్చారావు మాట్లాడుతూ కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆదేశాల మేరకు 30 కంపెనీలకు సంబంధించి 1,859 ఖాళీలను భర్తీ చేసేందుకు మెగా జాబ్‌మేళాను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామన్నారు. నిరుద్యోగ యువత ఈ నెల 20వ తేదీ ఉదయం తొమ్మిది గంటలకే చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో వికాస జిల్లా మేనేజరు గోళ్ల రమేష్, కాకినాడ మేనేజరు కె.శర్మ పాల్గొన్నారు.



మెగా జాబ్‌మేళా పోస్టర్లను విడుదల చేసిన కలెక్టర్ మహేష్‌కుమార్



నగరంలో గుమ్మటం ఊరేగిస్తున్న ముస్లింలు

హజరత్ అబ్బాస్‌కు నివాళి

మామిడికుదురు, జూలై 16: ఇమామ్ హుస్సేన్ సేనాని హజరత్ అబ్బాస్‌కు ముస్లింలు నివాళులర్పించారు. కర్బలా పుణ్యభూమిలో అశువులు బాసిన హజరత్ అబ్బాస్‌ను ధైర్యవంతునిగా, పరాక్రమశాలిగా, వీరత్వానికి మారుపేరుగా భక్తులు కొలుస్తారు. మంగళవారం మామిడికుదురులోని హజరత్ అబ్బాస్ పంజా నుంచి గుమ్మటాన్ని తీసి మాతం నిర్వహిస్తూ ఊరేగించారు. ఈ సందర్భంగా నగరంలోని పెదపంజీషా వద్ద భక్తులు నిప్పుల గుండం తొక్కారు. హజరత్ ఇమామ్ హుస్సేన్ పంజాలో మత ప్రబోధకుడు మహ్మద్ ఆలీజాఫర్ కర్బలా ఘటనను భక్తులకు మజ్లిస్ రూపంలో వివరించారు.

ఉచిత ఇసుక కేటాయింపులో మార్గదర్శకాలు పాటించాలి

కొవ్వూరు, తాళ్లపూడి గోదావరి బండ్ మార్గంలో సీసీ కెమెరాలు

జిల్లా ఇసుక కమిటీ సమావేశంలో కలెక్టర్ పి.ప్రశాంతి

రాజమహేంద్రవరం, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఉచిత ఇసుక కేటాయింపులో ప్రభుత్వ మార్గదర్శకాలు కచ్చితంగా పాటించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. రాజమహేంద్రవరంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన జిల్లా ఇసుక కమిటీ సమావేశంలో చైర్మన్, కలెక్టర్ ప్రశాంతి మాట్లాడారు. జిల్లా లోని 7 ఇసుక పాయింట్లు, 31 డిస్టిలేషన్‌పాయింట్ల వద్ద ప్రస్తుతం 3,77,350.50 మెట్రిక్ టన్నుల ఇసుక లభ్యత ఉందని తెలిపారు. భవన నిర్మాణాలు, ప్రభుత్వ ప్రాధాన్యత పనులకు ఉచిత ఇసుక కేటాయించాలన్నారు. బల్క్ కేటాయింపుల విషయంలో జిల్లా స్థాయి కమిటీ నిర్ణయం మేరకే కేటాయించాలన్నారు. ఇతర జిల్లాల విషయంలో ఆయా జిల్లాల కలెక్టర్, ఆయా జిల్లాల ఇసుక కమిటీ సిఫారసులను అనుసరించే కేటాయింపులు ఉంటాయని చెప్పారు. దీనికి సంబంధించిన విజిలెన్స్ ఆయా జిల్లాల పరిధిలోనే ఉంటుందన్నారు. జిల్లాలో అవసరాలకు అనుగుణంగా ఇసుక లభ్యత ఉండేలా పర్యవేక్షించాలన్నారు. గోదావరి ఉధృతి, ప్రతికూల పరిస్థితుల వల్ల స్టాక్ పాయింట్ల వద్ద నిల్వల కంటే ముందు డిస్టిలేషన్ పాయింట్ల వద్ద ఉన్న నిల్వలను గుర్తించి కేటాయించాలన్నారు. నదీ పరీవాహక ప్రాంతాల్లోని ఇసుక నిల్వలను అంచనా వేయాలని అధికారులను ఆదేశించారు. వ్యక్తిగత నిర్మాణాలకు ఆధార్, ప్లాన్ పంచాయతీ అధికారి ధ్రువీకరణ పత్రాలు అవసరమని తెలిపారు. సబ్-కలెక్టర్, ఆర్డీవోల వ్యక్తిగత పర్యవేక్షణ ఉండాలన్నారు. కొవ్వూరు, తాళ్లపూడి గోదావరి బండ్ మార్గంలో 360 డిగ్రీ సీసీ కెమెరాల పర్యవేక్షణ చేపట్టాలన్నారు. రాజమహేంద్రవరం మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోనూ, ఇతర ప్రైవేట్ ఏజెన్సీలకు చెందిన బల్క్ కేటాయింపులకు ఏడు ప్రతిపాదనలు వచ్చాయని, వాటికి నిబంధనలు అనుసరించి కమిటీ ఆమోదం తెలిపిందన్నారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి జేసీ కె.దినేష్‌కుమార్, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, డీఆర్వో జి.నరసింహులు, ఆర్డీవో ఎ.చైత్రవర్షిణి, మైన్స్ ఏడీ ఎం.సుబ్రహ్మణ్యం, సెబ్ ఏఎస్పీ వి.సోమశేఖర్, జిల్లా గ్రౌండ్ వాటర్ అధికారి వై.శ్రీనివాస్, ఇరిగేషన్ ఈఈ జి.కాశీ విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



బైక్‌ను ఢీకొన్న కారు

వృద్ధుడి దుర్మరణం

ఏలేశ్వరం, జూలై 16: కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం పేరవరం జంక్షన్ వద్ద రోడ్డు ప్రమాదంలో మంగళవారం ఓ వ్యక్తి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దాపురం మండలం గుడివాడకు చెందిన కనపర్తి సూర్యుడు (80) ఫైనాన్స్ నిమిత్తం మోటార్ సైకిల్‌పై పేరవరం వెళ్లి తిరిగి వెళ్తుండగా జాతీయ రహదారి జంక్షన్‌లో విశాఖపట్నం నుంచి రాజమహేంద్రవరం వైపుగా వెళ్తున్న కారు స్పీడుగా వచ్చి మోటార్ సైకిల్‌ను ఢీకొనడంతో సూర్యుడు అక్కడికక్కడే మృతి చెందారు. ఆయనకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. సూర్యుడు అల్లుడు జి.సుబ్బిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సతీష్ తెలిపారు.

ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీ

ఒకరి మృతి..ఇద్దరికి తీవ్రగాయాలు



మృతిచెందిన గంగయ్య

వరరామచంద్రాపురం, జూలై 16: మండలంలోని రాయిగూడెం, వీఆర్‌పురం మధ్యలో పూచిక వాగు దగ్గర మంగళవారం రెండు బైక్‌లు ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతిచెందగా, ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. మండలంలోని రాయిగూడెం గ్రామానికి చెందిన నూపా గంగయ్య (40) మరో మహిళ ద్విచక్ర వాహనంపై వీఆర్ పురం వస్తుండగా, కొటారుగొమ్ము గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు ద్విచక్ర వాహనంపై వీఆర్‌పురం నుంచి కొటారిగొమ్ము వెళ్తున్న క్రమంలో రాయిగూడెం, వీఆర్‌పురం మధ్యలో పూచిక వాగు దగ్గర రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈ సంఘటనలో రాయగూడెం గ్రామానికి చెందిన నూపా గంగయ్య అక్కడికక్కడే మృతిచెందగా కొటారిగొమ్ము గ్రామానికి చెందిన ఇద్దరి యువకులు తీవ్రగాయాల పాలయ్యారు. అటుగా వెళ్తున్న వారు జరిగిన ప్రమాద విషయాన్ని 108 వాహనానికి తెలియజేయగా, అంబులెన్సు అక్కడకు చేరుకొని గాయాలైన వారిని, మృతదేహాన్ని కోతులగుట్ట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రులను మెరుగైన వైద్యం కోసం భద్రాచలం తరలించారు.

కాంక్రీట్ మిక్చర్‌లో పడి యువకుడి దుర్మరణం

సామర్లకోట, జూలై 16: సామర్లకోట మండలం అచ్చంపేట సమీపాన ఒక ప్రైవేట్ కాంక్రీట్ రడీ మిక్స్ సంస్థలో మంగళవారం రాత్రి ప్రమాదవశాత్తూ కాంక్రీట్ మిక్చర్‌లో పడి పిఠాపురం మండలం లక్ష్మీనరసాపురం గ్రామానికి చెందిన బుర్రా సత్య సాయి(18)(సత్తిబాబు) అక్కడికక్కడే మృతి చెందాడు. యువకుని శరీరం నుజ్జునుజ్జు అయ్యింది. గుర్తించేందుకు వీలులేని స్థితికి చేరింది. సమాచారం అందిన వెంటనే సామర్లకోట పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై ఆరా తీశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.



సత్యసాయి(ఫైల్)

ఒడిసాకు చెందిన వివాహిత హత్య

భర్తే చంపి ఉంటాడనే అనుమానాలు

సర్పవరం జంక్షన్, జూలై 16: కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ సర్పవరం శివారు భావనారాయణపురంలో ఒడిసాకు చెందిన వివాహిత హత్యకు గురైంది. భర్తే ఈ హత్యకు పాల్పడి ఉంటాడని బంధువులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఘటన జరిగిన తర్వాత మూడేళ్ల కుమారుడితో ఆమె భర్త పరారవ్వడంతో అతనే హత్యకు పాల్పడి ఉంటాడని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. వివరాల్లోకెళితే ఒడిసా గంజాం జిల్లా కైరాపుటికి చెందిన రిటంగేల్ గౌడ స్త్వెయిన్ (31), నీలు స్త్వెన్‌లు భార్యాభర్తలు, వీరికి మూడేళ్ల కుమారుడు ఉన్నాడు. జీవనోపాధి కోసం మూడు నెలల కిందట ఒడిసా రాష్ట్రం నుంచి కాకినాడ రూరల్ మండలం సర్పవరం శివారు భావనారాయణపురంలో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. ఇక్కడ ఉంటున్న బంధువులతో కలిసి భర్త సీలింగ్ ఇతర కూలి పనులకు వెళ్తున్నాడు. మంగళవారం ఉదయం భార్య గౌడ స్త్వెన్‌కు సోదరి ఫోన్ చేసినా ఎత్తకపోవడంతో తన భర్తను మరదలి ఇంటికెళ్లి చూచి రమ్మని పంపించింది. ఇంట్లో గౌడ స్త్వెన్ బోర్లా కింద పడి ముక్కులో నుంచి రక్తస్రావంతో విగతజీవిగా పడి ఉండటాన్ని గుర్తించి సోదరికి సమాచారం అందించగా ఆమె వచ్చి పరిశీలించి మృతి చెందినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చింది. సంఘటనా స్థలానికి కాకినాడ ఎస్‌డీపీవో కె.హనుమంతరావు, సర్పవరం ఎస్‌హెచ్‌వో వైఆర్‌కే శ్రీనివాస్‌లు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. ఆధారాలు కోసం పోలీసు జాగిలాలను రప్పించారు. భార్యభర్తల మధ్య వివాదాలు ఏమన్నాయా ఉన్నాయా, భర్త ఎక్కడ ఉన్నాడంటూ స్థానికుల నుంచి పోలీసులు సమాచారం సేకరించారు. మూడేళ్ల కుమారుడితో భర్త పరారైనట్లు బంధువులు పోలీసులకు తెలిపారు. భర్తే హత్య చేసి పరారై ఉంటాడని బంధువులు అనుమానం వ్యక్తం చేశారు. గౌడ స్త్వెయిన్ సోదరి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో వైఆర్‌కే శ్రీనివాస్ తెలిపారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు.



గౌడ స్త్వెయిన్ మృతదేహం, కుమారుడితో(ఫైల్)



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

దొంగతనాల కేసులో నిందితుడి అరెస్టు

రూ.11 లక్షల విలువైన చోరీ సొత్తు స్వాధీనం

మామిడికుదురు, జూలై 16: వరుస దొంగతనాలకు పాల్పడుతున్న బీఆర్ అంబేడ్కర కోనసీమ జిల్లా రాజోలు మండలం కాట్రేనిపాడు గ్రామానికి చెందిన రేకపల్లి నాగరాజును అరెస్టు చేసినట్టు నగరం ఎస్‌ఐ పి.సురేష్ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం నాగరాజుపై వివిధ పోలీసుస్టేషన్లలో తొమ్మిది దొంగతనం కేసులు ఉన్నాయని, ఇటీవల మగటపల్లి గ్రామంలో ఓ దొంగతనం చేయగా అదుపులోకి తీసుకుని విచారించగా మొత్తం దొంగతనాల వివరాలు బయటపడినట్టు తెలిపారు. నిందితుడు ఉపాధి నిమిత్తం తమిళనాడులో కొబ్బరి ఒలుపు చేస్తుంటాడని, ఇటీవల జరిగిన ఎన్నికల నిమిత్తం స్వగ్రామం వచ్చి ఈ దొంగతనాలకు పాల్పడ్డాడని ఎస్‌ఐ తెలిపారు. నిందితుడి వద్ద నుంచి రూ.10 లక్షల 20 వేలు విలువైన 160 గ్రాముల బంగారం, రూ.80 వేలు నగదుతో పాటు సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. నిందితుడిని అరెస్టుచేసి రాజోలు కోర్టుకు రిమాండ్ నిమిత్తం మంగళవారం పంపిస్తున్నట్టు తెలిపారు. ఈ కేసులో చాకచక్యంగా దర్యాప్తుచేసి నిందితుడిని అరెస్టు చేయడంలో కీలక పాత్ర పోషించిన నగరం ఎస్‌ఐ సురేష్, హెచ్‌సీ బొక్కా శ్రీనివాస్, పీసీ డి.చిరంజీవి, నగరం పోలీస్‌స్టేషన్ సిబ్బందిని పి.గన్నవరం సీఐ డి.ప్రశాంత్‌కుమార్ అభినందించి రివార్డుకు సిఫార్సు చేశారు.



నిందితుడి వివరాలు తెలియజేస్తున్న ఎస్‌ఐ సురేష్

వైసీపీ హయాంలో మాజీ మంత్రి దాడిశెట్టి రాజా అండతో

దళితుల భూమి కబ్జా

తొండంగి మండలం కోదాడలో ఉప్పు చెరువు భూముల్లో పాగా

మాజీ మంత్రి దాడిశెట్టి, ఆయన మామ అండతో కబ్జా చేశారని దళితుల ఆరోపణ

శాసనమండలి ప్రతిపక్ష నేత యనమల ఆదేశాలతో టీడీపీ బృందం భూ పరిశీలన



భూములను పరిశీలిస్తున్న టీడీపీ బృందం

తొండంగి, జూలై 16: మాజీ మంత్రి దాడిశెట్టి రాజా, ఆయన మామ అండదండలతో తాము సాగు చేసుకుంటున్న భూములు కబ్జాకు గురయ్యాయని తొండంగి మండలంలో మూడు గ్రామాల దళితులు శాసన మండలి ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడు దృష్టికి తీసుకురావడంతో ఆయన ఆదేశాలతో మంగళవారం టీడీపీ బృందం కబ్జాకు గురైన భూములను పరిశీలించింది. కబ్జా కోరల్లో ఉన్న ఉప్పు చెరువు భూములను టీడీపీ నేతలు యనమల రాజేష్, సుర్ల లోవరాజు, చింతంనీడి అబ్బాయి, కోడ వెంకటరమణ తదితరులతో కూడిన బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా అక్కడకు మూడు గ్రామాలకు చెందిన దళితులు వచ్చి టీడీపీ నేతలకు గోడు చెప్పుకున్నారు. ఉప్పు చెరువు భూములు వైసీపీ పాలనలో కబ్జాకు గురయ్యాయని వారి కబంధ హస్తాల నుంచి వాటిని విడిపించి తమకు కేటాయించాలని కోరారు. చెరువు ప్రాంతంలో ఉన్న సుమారు 80 ఎకరాల భూమి నీటి తెప్పగా ఉండేదని దీనిని దశాబ్దాలుగా దళితులు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. గత వైసీపీ పాలనలో మాజీ మంత్రి దాడిశెట్టి రాజా, ఆయన మామ అండదండలతో కొందరు ఈ భూములను కబ్జా చేశారన్నారు. తప్పుడు రికార్డులు సృష్టించి రెవెన్యూ రికార్డుల్లో తమ పేరున ఆన్‌లైన్ చేయించుకున్నారన్నారు. ఆక్రమించిన భూముల్లో చేపల చెరువులు తవ్వుతుండగా అడ్డుకున్న తమను బలవంతంగా పోలీసులతో ఖాళీ చేయించారని, తమపై పోలీసు కేసులు పెట్టారని వాపోయారు. చేపల చెరువుల వ్యర్థాలు చెరువులో కలవడం వల్ల 16 గ్రామాలకు సరఫరా అవుతున్న నీరు కలుషితమవుతోందన్నారు. దీని వల్ల డయేరియా వంటి వ్యాధులు ప్రబలి కొమ్మనాపల్లిలో పలువురు మృతి చెందడంతో పాటు వందల మంది వ్యాధి బారిన పడ్డారన్నారు. దీని వలన ప్రజల ప్రాణాలకు రక్షణ లేకుండా పోతోందన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు నేతలకు వినతి పత్రం అందించారు. దళిత నాయకులు బూర్తి కృష్ణ, బూర్తి సింహాచలంతో పాటు టీడీపీ నాయకులు సాధనాల నూకరాజు,కొయ్యా రామకేశవ, పిర్ల శివ తదితరులు ఉన్నారు. ఇదిలా ఉంటే వివాదానికి సంబంధించిన సమగ్ర సమాచారంతో, రికార్డులతో హాజరు కావాల్సిందిగా యనమల రామకృష్ణుడు రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కబ్జాకు గురైన భూములను విడిపించి దళితులకు న్యాయం చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.

ఏజెన్సీ చోడవరంలో పేకాట డెన్

ఆదివాసీల ఆవాసాల్లో దర్జాగా పేకాట

పేకాట శిబిరంలో విలాసవంతమైన సౌకర్యాలు

చక్రం తిప్పుతున్న తెలంగాణ పేకాట నిర్వాహకులు

ఎటపాక, జూలై 16: ఎటపాక మండలం, చోడవరం గ్రామం నుంచి సుమారు 2 కిలోమీటర్ల దూరంలో అటొక మారుమూల ప్రాంతం. అక్కడ పంట పొలాల మధ్య సుమారు మూడు గిరిజన కుటుంబాలు నివాసముంటున్నాయి. ఆ ప్రాంతంపై తెలంగాణ పేకాట నిర్వాహకుల కన్నుపడింది. ఇంకేముందు విలాసవంతమైన పేకాట జూద శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతంలో గత ఐదారు రోజులు నుంచి దర్జాగా పేకాట జూదాన్ని నిర్వహిస్తున్నారు. గిరిజనుడికి చెందిన రెండు గోదాములను అద్దెకు తీసుకుని, దానిని పేకాట డెన్‌గా మార్చారు. పేకాట నిర్వాహకులు సాయంత్రం వేళ నుంచి తెల్లవార్లు పేకాట శిబిరాన్ని నిర్వహిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. లోపల టేబుళ్లను ఏర్పాటు చేసుకుని మూడు ముక్కలాట క్రీడను యథేచ్ఛగా ఆడిస్తున్నారు. రోజుకు రూ.వేలల్లో చేతులు మారుతున్నట్లు తెలుస్తోంది. అయితే తెలంగాణలోని బూర్గంపాడు, భద్రాచలం పట్టణాలకు చెందిన పేకాట నిర్వాహకులు ఈ శిబిరాన్ని నిర్వహిస్తూ చక్రం తిప్పుతున్నట్లు తెలుస్తోంది. పేకాట శిబిరంలో ఆటగాళ్లకు విలాసవంతమైన వసతులను సైతం ఏర్పాటు చేస్తున్నారు. గదుల్లో ఏసీలు, ఫ్యాన్లు అమర్చుతూ జూదం సాగిస్తున్నారు. ఇక్కడే మందు, ముక్క అనేక సౌకర్యాలు అందుబాటులో ఉంటాయి. దీంతో తెలంగాణ, ఏపీ ప్రాంతాల నుంచి జూదగాళ్లు ఇక్కడకు పరుగులు తీస్తున్నారు. ఆటగాళ్లు జూదంలో పాల్గొని జేబులు ఖాళీ చేసుకోని నిరాశగా వెళ్లిపోతున్నారు. కాగా ఇంత వ్యవహారం జరుగుతున్నా పోలీసులు ఈ వైపు కన్నెత్తి కూడా చూడడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై ఎస్‌ఐ పార్థసారథిని వివరణ కోరగా మంగళవారం సాయంత్రం శిబిరంపై దాడి చేశామన్నారు. అయితే పేకాటరాయుళ్లు అక్కడ నుంచి పరారయ్యారన్నారు. ఫర్నీచర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. పేకాట శిబిరంపై నిరంతరం పర్యవేక్షణ ఉంటుందని కఠినచర్యలు తీసుకుంటామని చెప్పారు.

నిలకడగా గోదావరి నీటి మట్టం

ధవళేశ్వరం, జూలై 16: ధవళేశ్వరం వద్ద గోదావరి నీటి మట్టం నిలకడగా కొనసాగుతోంది. మంగళవారం సాయంత్రానికి కాటన్ బ్యారేజ్ 4 ఆర్మ్‌లలో ఉన్న 175 గేట్లకుగాను 130 గేట్లను 20మిల్లీమీటర్ల మేరపైకి ఎత్తి 78,791 క్యూసెక్కుల జలాలను దిగువకు విడిచి పెడుతున్నారు. నీటి మట్టం 10.35 అడుగులుగా నమోదయింది. వ్యవసాయ అవసరాల కోసం తూర్పుడెల్టాకు 3వేల క్యూసెక్కులు, మధ్యడెల్టాకు 1700క్యూసెక్కులు, పశ్చిమడెల్టాకు 4వేల క్యూసెక్కులు చొప్పున సాగునీటిని విడుదల చేస్తున్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించిన ఐటీడీఏ పీవో

వరరామచంద్రాపురం, జూలై 16: మండల కేంద్రమైన వీఆర్ పురంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను చింతూరు ఐటీడీఏ పీఓ కావూరి చైతన్య మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీవో చైతన్య, ఎంఈవో లక్ష్మీనారాయణ, కళాశాల అధ్యాపకులతో మాట్లాడి కళాశాలలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలోనే జనసేన మండల అధ్యక్షుడు ములకాల సాయికృష్ణ మాట్లాడుతూ హాస్టల్ సదుపాయం ఉంటే విద్యార్థుల సంఖ్య పెరుగుతుందని, కళాశాలలో తాగునీటి సౌకర్యం కల్పించాలని పీవో దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. రాబోవు గోదావరి వరదలను దృష్టిలో ఉంచుకుని తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, సహాయక చర్యలు, పునరావాస కేంద్రాల నిర్వహణ మొదలగు అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో తహశీల్దార్ మౌలానాఫాజిల్, జడ్పీటీసీ వాళ్ల రంగారెడ్డి, ఎస్‌ఐ నాగరాజు, ఆర్‌ఐ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ హరీష్‌మాధుర్

ఓఎన్జీసీ రాజమండ్రి అసెట్ అభివృద్ధికి పూర్తి సహకారం

తొలిసారిగా రాజమండ్రి అసెట్ కార్యాలయాలను సందర్శించిన ఎంపీ హరీష్‌మాధుర్

రాజమహేంద్రవరం సిటీ, జూలై 16 : ఓఎన్‌జీసీ రాజమండ్రి అసెట్, అమలాపురం రీజియన్ల అభివృద్ధికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్ అన్నారు. ఎంపీ అయ్యాక తొలిసారిగా ఓఎన్‌జీసీ రాజమండ్రి అసెట్‌ను మంగళవారం సందర్శించారు. ఎంపీకి అసెట్ మేనేజరు శాంతనుదాస్ బృందం ఘనంగా స్వాగతం పలికారు. తొలుత అసెట్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహాత్మగాంధీ విగ్రహాలకు ఎంపీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అటుపై ఆవరణలో మొక్కను నాటారు. కాన్ఫరెన్స్ హాలులో రాజమండ్రి అసెట్ కార్యకలాపాలకు సంబంధించి సంక్షిప్త ప్రదర్శనను ఎంపీ తిలకించారు. భూసేకరణ, పైప్‌లైన్ వేయడం తదితర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఓఎన్‌జీసీ అసెట్ సీనియర్ అధికారులు, కలెక్టివ్ పాల్గొన్నారు.



పోలీసుల సంరక్షణలో ఉన్న యువతి

నాలుగు నెలలు తర్వాత క్షేమంగా ఇంటికి..

సామర్లకోట, జూలై 16: సామర్లకోట రైల్వే పోలీసులు రాజోలు రాజేశ్వరి అనే యువతిని ఆమె తల్లిదండ్రులకు మంగళవారం క్షేమంగా అప్పగించారు. సామర్లకోట రైల్వే పోలీసులు అందించిన సమాచారం మేరకు మెదక్ జిల్లా మూసాయికోపేట మండలం పోతనపల్లి గ్రామానికి చెందిన రాజోలు బాలరాజు కుమార్తె అయిన రాజేశ్వరి ఇంటి నుంచి ఫిబ్రవరి 2024 నెలలో వెళ్లిపోగా రాజేశ్వరి తల్లి సికింద్రాబాద్ రైల్వే పోలీసులకు అప్పడే ఫిర్యాదు చేశారు. ఆమె ఆచూకీ కోసం అప్పటినుంచీ సికింద్రాబాద్ రైల్వే పోలీసులు గాలింపు చర్యలు చేపట్టగా మంగళవారం సామర్లకోట రైల్వే పోలీసులను సికింద్రాబాద్ రైల్వే పోలీసులు అప్రమత్తం చేయడంతో సామర్లకోట రైల్వే పోలీసులు సామర్లకోట ప్లాట్‌ఫాంపై గాలించడంతో అనుమానాస్పదంగా తిరుగుతున్న రాజేశ్వరిని గుర్తించి సికింద్రాబాద్ రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. రాజేశ్వరి బంధువులు సామర్లకోట చేరుకోవడంతో సామర్లకోట రైల్వే ఎస్‌ఐ లోవరాజు క్షేమంగా అప్పగించారు.

ఆగస్టు 7 నుంచి భీమేశ్వరుని దర్శనం

ద్రాక్షారామ, జూలై 16: ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో ఆగస్టు 7 నుంచి భీమేశ్వర స్వామి, మాణిక్యాంబ అమ్మవారి దర్శనం, పూజాధికాలకు భక్తులను అనుమతించనున్నట్లు ఆలయ ఈవో పి.టి.వి. సత్యనారాయణ మంగళవారం తెలిపారు. కేంద్ర పురావస్తుశాఖ ఆధ్వర్యంలో ప్రస్తుతం మూలవిరాట్ సంరక్షణ పనులు పూర్తికాగా అమ్మవారి గర్భాలయంలో కొన్ని అభివృద్ధి పనులు కొనసాగిస్తున్నారు. ఈనెల 20 నాటికి పనులు పూర్తి చేస్తామని కేంద్ర పురావస్తు శాఖాధికారులు ఆలయ ఈవోకు సమాచారం ఇచ్చినట్లు ఈవో పత్రికా ప్రకటనలో తెలిపారు. ఆలయ అర్చకులతో సమావేశం నిర్వహించామని ఆలయ బ్రహ్మలు సూచన మేరకు శూన్యమాసం అయినందున శ్రావణ శుద్ధ పౌర్ణమి రోజున వచ్చేనెల 5న సంప్రోక్షణ కార్యక్రమాలు ప్రారంభించి 6 వరకు నిర్వహించేందుకు నిర్ణయించామన్నారు. 7 ఉదయం నుంచి భీమేశ్వరస్వామి, మాణిక్యాంబ అమ్మవార్లను భక్తులు దర్శించేందుకు అనుమతి ఇస్తామన్నారు. అంతవరకు నంది మండపంలో బాలాలయంలో స్వామి,అమ్మవారి దర్శనం కొనసాగిస్తామని ఈవో తెలిపారు. స్వామివారి మూలవిరాట్ సంరక్షణ పనులు, ఇతర అభివృద్ధి పనులు నిమిత్తం దర్శనం ఏప్రిల్ 24 నుంచి నిలిపివేసిన సంగతి తెలిసిందే.

టైప్ రైటింగ్ పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలి


కాకినాడ సిటీ, జులై 16 : రాష్ట్రవ్యాప్తంగా 35 కేంద్రాలలో ఈ ఏడాది సెప్టెంబర్ 28, 29 తేదీల్లో ఆంధ్రప్రదేశ్ స్టేట్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ బోర్డు నిర్వహించే టైప్ రైటింగ్ పరీక్షలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ టైప్ రైటింగ్ అండ్ షార్ట్‌హ్యాండ్ ఇన్‌స్టిట్యూట్స్ అసోసియేషన్ రీజనల్ కార్యదర్శి, కాకినాడ సెంటర్ అధ్యక్షుడు జి.శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పై తేదీలలో ఇంగ్లీషు, తెలుగు భాషలలో లోయర్, హయ్యర్ గ్రేడ్, హైస్పీడ్ పరీక్షలను, ఇంగ్లీషు జూనియర్ గ్రేడ్ పరీక్షలను, హిందీలో లోయర్, హయ్యర్ గ్రేడ్ పరీక్షలను నిర్వహిస్తారన్నారు. అదే విధంగా సెప్టెంబర్ 21,22 తేదీలలో రాష్ట్ర వ్యాప్తంగా 6 కేంద్రాలలో షార్ట్ హ్యాండ్ పరీక్షలను నిర్వహిస్తారన్నారు. విజయవాడ షార్ట్ హ్యాండ్ కేంద్రాన్ని రద్దు చేసి, గుంటూరులో నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ పరీక్షలకు ఇంకా 75 రోజుల సమయం ఉన్నందున స్థానికంగా ఉన్న టైప్ రైటింగ్ ఇన్‌స్టిట్యూట్స్ వారిని సంప్రదించి, సకాలంలో పరీక్ష ఫీజు చెల్లించి పరీక్షలకు సిద్ధం కావాలన్నారు.

యువతుల ఉపాధి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

సామర్లకోట, జూలై 16: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, సీడాప్ ఆధ్వర్యంలో సామర్లకోట టీటీడీసీ శిక్షణా కేంద్రంలో ఉచిత భోజన, వసతి సదుపాయాలతో యువతులకు ఉచిత ఉపాధి శిక్షణ అందిస్తున్నందున ఔత్సాహికులైన యువతులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీరమణి, జిల్లా జాబ్స్ మేనేజర్ కిరణ్ మంగళవారం తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని నిరుద్యోగ యువతులకు శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు సైతం నేరుగా కల్పిస్తామని చెప్పారు. శారీస్ పెయింటింగ్స్, ఎంబ్రాయిడరీ కోర్సులలో శిక్షణా తరగతులు 15 రోజుల పాటు ఉంటాయన్నారు. ఈ కోర్సులలో చేరే యువతుల వయస్సు 18 నుంచి 40 సంవత్సరాల లోపు ఉండాలన్నారు. అలాగే వారి విద్యార్హత 8వ తరగతి ఆపైన ఉండాలన్నారు. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల యువతులకు మాత్రమే ఈ అవకాశం ఉన్నందున సద్వినియోగం చేసుకోవాలని పీడీ శ్రీరమణి, కిరణ్ తెలిపారు.

నవోదయ ప్రిన్సిపాల్‌గా సీతాలక్ష్మి

పెద్దాపురం, జూలై 16: స్థానిక జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్‌గా బి.సీతాలక్ష్మి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఆమె పశ్చిమ గోదావరి జిల్లా పెదవేగి నవోదయలో వైస్ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తూ పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. నూతనంగా బాధ్యతలను చేపట్టిన ప్రిన్సిపాల్ సీతాలక్ష్మీని విద్యాలయ వైస్ ప్రిన్సిపాల్ రామకృష్ణయ్య, ఉపాధ్యాయులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు.



తాటిచెట్టుపై నుంచి పడి వ్యక్తి మృతి

కిర్లంపూడి, జూలై 16: కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలంలోని సింహాద్రిపురం గ్రామంలో జి.కుమార్ రాజు(29) అనే వ్యక్తి తాటిచెట్టు నుంచి పడి మృతిచెందాడు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..సోమవారం మధ్యాహ్నం కుమార్‌రాజు ఒక రైతు పొలంలో తాటి చెట్టు ఎక్కగా ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. హుటాహుటిన ప్రత్తిపాడు ప్రభుత్వాస్పత్రికి తరలించగా మెరుగైన వైద్యం నిమిత్తం కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే మంగళవారం చికిత్స పొందుతూ మృతిచెందాడు. దీంతో కుటుంబీకులు కాకినాడ జీజీహెచ్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ మేరకు కిర్లంపూడి ఎస్‌ఐ జబీర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు.



జీజీహెచ్ వద్ద బంధువుల ఆందోళన

మోదీ, చంద్రబాబు, పవన్ చిత్రపటాల ఏర్పాటు

అయినవిల్లి, జూలై 16: కె.జగన్నాథపురం పంచాయతీ కార్యాలయంలో మంగళవారం ప్రధాని నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చిత్రపటాలను మంగళవారం మాజీ జడ్పీటీసీ గంగుమళ్ల కాశీ అన్నపూర్ణ ఏర్పాటు చేశారు. వారి హయాంలో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. పంచాయతీ కార్యదర్శి విత్తనాల వెంకటరమణ, గనిశెట్టి వెంకటేశ్వరరావు, ములికి విఘ్నేశ్వరుడు, బళ్ల ఆనంద్, నల్లా శ్రీను, నల్లా చిన్నా, మిద్దే పట్టాభి, బొబ్బిలి బాలాజీ, మొర్త సత్తిబాబు పాల్గొన్నారు.

‘రాజోలు’లో 20వేలు దాటి సభ్యత్వాలు చేయాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

మలికిపురం, జూలై 16: రాజోలు నియోజకవర్గంలో 20వేలు లక్ష్యంగా క్రియాశీల సభ్యత్వాలు నమోదు చేయాలని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. మంగళవారం మలికిపురం ఎల్ఎస్ ల్యాండ్ మార్కులో క్రియాశీల సభ్యత్వాలపై జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల18 నుంచి 28వరకు జరిగే క్రియాశీల సభ్యత్వ నమోదులో కార్యకర్తలు చురుగ్గా పాల్గొనాలన్నారు. జనసేన పార్టీ సభ్యత్వం ఒక గుర్తింపు అని, క్షేత్రస్థాయిలో ఎంతో మంది సభ్యత్వం కోసం ఎదురు చూస్తున్నారన్నారు. నియోజకవర్గంలో వంద మంది వలంటీర్లను నియమించి తద్వారా ప్రతీ వలంటీరు 200మంది సభ్యులను చేర్పించే ప్రణాళికతో కృషి చేయాలన్నారు. ప్రమాద బీమాను వివరించాలన్నారు. నిర్మాణాత్మకం, పనితనం గుర్తింపు నిస్తాయన్నారు. పార్టీ మండల నాయకులు క్రియాశీలక సభ్యత్వాల్లో తమ పాత్రలను నిరూపించుకోవాలని దేవ అన్నారు. గుండుబోగుల పెద్దకాపు అధ్యక్షతన జరిగిన సమావేశంలో తాడి మోహన్, గెడ్డం మహలక్ష్మిప్రసాద్, మల్లిపూడి సత్తిబాబు, గుబ్బల ఫణి, సూరిశెట్టి శ్రీనివాస్, దొడ్డా జయరామ్, పినిశెట్టి బుజ్జి, రాపాక రమేష్‌బాబు, ఇంటిపల్లి ఆనందరాజు, ముప్పర్తి సాయిబాబు, ఆకుల చినవెంకన్నాయుడు, అల్లూరి రంగరాజు తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆకలి తీర్చే అన్నక్యాంటీన్లు త్వరలో ప్రారంభం

మండపేట, రామచంద్రపురంలలో ఏర్పాట్లు



మండపేట ఏడిదరోడ్డులో ఉన్న అన్నక్యాంటీన్ (ఫైల్)

మండపేట, జూలై16: అన్నక్యాంటీన్లను ప్రారంభించడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. మండపేటలోని ఏడిద రోడ్డు 22వ వార్డులో ఉన్న అన్నక్యాంటీన్ పునరుద్ధరణ కోసం రూ.20లక్షలు నిధులు కేటాయించారు. త్వరలోనే ఈక్యాంటీన్‌ను ప్రారంభించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. అలాగే రామచంద్రపురంలో ఉన్న అన్నక్యాంటీన్‌ను సచివాలయంగా మార్చేశారు. అక్కడ కూడా అన్నక్యాంటీన్ పునరుద్ధరణకు చర్యలు చేపడుతున్నారు. అన్నక్యాంటీన్లను మళ్లీ ప్రారంభిస్తే పేదల ఆకలి తీరనుంది. అన్నక్యాంటీన్లలో ఉదయం అల్పాహారం రూ.18, మధ్యాహ్నం భోజనం రూ.27.50, రాత్రి భోజనం రూ.27.50 (మొత్తం రూ.73) ఖర్చు అవుతుంది. అయితే కూటమి ప్రభుత్వం ఉదయం అల్పాహారం రూ.5, మధ్యాహ్నం భోజనం రూ.5, రాత్రి భోజనం రూ.5కి అందించి పేదల ఆకలి తీర్చనుంది. మండలంలోని గ్రామాల నుంచి పనుల కోసం పట్టణానికి వచ్చే పేద ప్రజల ఆకలిని అన్నక్యాంటీన్లు తీరుస్తాయి.

మహిళలకు ఉపాధి కల్పనే ధ్యేయంగా అదిత్రి ప్రోగ్రాం


సీఎస్సార్ అదిత్రి అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఏపీఎం విజయ్

అంతర్వేది, జూలై 16: సఖినేటిపల్లిలంక, వీవీమెరక గ్రామాల్లో ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ఆధ్వర్యంలో అదిత్రి అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. ప్రాజెక్టు లీడ్ స్వాతిలేఖ, ప్రాజెక్టు మేనేజర్ రత్నకిశోర్ పర్యవేక్షణలో సఖినేటిపల్లి మండల మహిళా సమైఖ్య ఏపీఎం కె.విజయ్ ముఖ్య అతిథిగా పాల్గొని మహిళల ఉపాధి కల్పన గురించి మాట్లాడారు. ఈసెషన్‌లో గ్రామీణ మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు. డీఆర్డీఏ (జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ) ప్రాజెక్టు డైరెక్టర్, వెలుగు మహిళా సమాఖ్య మండలి సహకారంతో మహిళలకు వ్యవస్థాపక నైపుణ్యాలు పెంపొందించడం, మార్కెటింగ్ సదుపాయాలు కల్పించడంలో వారు విజయం సాధించేందుకు అవసరమైన జ్ఞానం, వనరులను అందించడంపై దృష్టి సారించారన్నారు. స్థానిక కమ్యూనిటీని అభివృద్ధి చేయడానికి మద్దతు ఇచ్చే లక్ష్యంగా సంఘం ఐక్యతకు, సామాజిక బాధ్యతకు తోడ్పడుతుందని, మహిళల్లో ఉపాధి కల్పన ఆలోచనలను పెంపొందించే విధంగా ఎస్ఆర్ఎం యూనివర్శిటీ సీఎస్సార్ అదిత్రి ప్రోగ్రాం నిర్వాహకులు ప్రత్యేక దృష్టి సారించారు. సఖినేటిపల్లిలంక, వీవీమెరక గ్రామాలతో పాటు మోరి, మోరిపోడు గ్రామాల ప్రజలు ఈఅవగాహన సదస్సులో పాల్గొన్నారు. సర్పంచ్‌లు ముప్పర్తి అలివేలుగంగాత్రివేణి, రేపూరు రాజేశ్వరి, అదిత్రి ప్రాజెక్టు మేనేజర్ గంటా సునీల్, రాంజీ, డ్వాక్రా వీవోల, ఎస్ఆర్ఎం యూనివర్సిటీ సిబ్బంది పాల్గొన్నారు.

రెడ్డిపల్లిలో సాధారణ జ్వరాలే


జ్వరపీడిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

అమలాపురం రూరల్, జూలై 16: రెడ్డిపల్లిలో జ్వరాలు ప్రబలాయన్న సమాచారంతో అధికారులు, ప్రజాప్రతినిధులు మంగళవారం గ్రామానికి చేరుకున్నారు. తొలుత జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఎం.దుర్గారావుదొర, అదనపు వైద్యాధికారిణి సీహెచ్‌వీ భరతలక్ష్మి, పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ స్వర్ణకమల సిబ్బందితో వచ్చి జ్వరపీడితులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ముగ్గురికి సాధారణ జ్వరాలు ఉన్నట్టు గుర్తించారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, డీఎల్పీవో పి.బొజ్జిరాజు జ్వరపీడిత కుటుంబాలను పరామర్శించి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ కరాటం రత్నప్రసన్న-ప్రవీణ్, కాశిన శేషుబాబు, ఉప్పుగంటి బసవరాజు తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో యానాం విద్యార్థుల ప్రతిభ

యానాం, జూలై 16: పుదుచ్చేరి రాష్ట్రంలో జరిగిన తైక్వాండో చాంపియన్ షిప్ 2024 పోటీల్లో యానాం విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని కోచ్ యనమదల రాజరాజేశ్వరి తెలిపారు. ఈపోటీల్లో ఎం.శ్యామ్‌సాయితేజ, ఎం.జాహ్నవి రజత పతకాలు, సీహెచ్ లిత్విక్, జీహెచ్ వీఎస్ కార్తికేయ కాంస్య పతకాలు సాధించారు. వీరితో పాటు ఈపోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కోచ్, అత్తిలి సత్యనారాయణ, స్థానికులు అభినందించారు.



ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తున్న స్థానికులు

• నిరుపయోగంగా బాలుర వసతి గృహం
• రెండు గదులతో ముక్కామల పీహెచ్‌సీ
• పీహెచ్‌సీకి వసతి గృహం కేటాయించాలని వినతి

బీసీ వసతి గృహాన్ని పీహెచ్‌సీకి కేటాయించండి

అంబాజీపేట, జూలై 16: పేద, మధ్య తరగతి విద్యార్థుల వసతి కోసం పుల్లేటికుర్రు సంతమార్కెట్‌లో నిర్మించిన బీసీ బాలుర వసతి గృహం నిరుపయోగంగా ఉంది. గతంలో పుల్లేటికుర్రులో ఈవసతి గృహాన్ని అద్దెభవనంలో నిర్వహించే వారు. అయితే గ్రామస్థులు, విద్యార్థుల తల్లిదండ్రుల విజ్ఞప్తిమేరకు 2012లో అప్పటికాంగ్రెస్ ప్రభుత్వంలో రూ.35 లక్షలతో 30గదులు నిర్మించారు. కొన్నాళ్ల పాటు విద్యార్థులతో ఈవసతి గృహాన్ని సక్రమంగా నిర్వహించారు. అనంతరం గంగలకుర్రులో సమీకృత హాస్టల్‌ను నిర్మించడంతో ఇక్కడి విద్యార్థులను అక్కడికి బదిలీ చేశారు. దీంతో అప్పటి నుంచి ఈభవనం నిరుపయోగంగా ఉంది. ఈవసతి గృహంలో కొందరు యువకులు మద్యం సేవిస్తున్నారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈభవనాన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి కేటాయించాలని సర్పంచ్ జల్లి బాలరాజు, గ్రామస్థులు కోరుతున్నారు. ఈప్రతిపాదనను కలెక్టర్, ఆయా శాఖల అధికారులకు సర్పంచ్ బాలరాజు వినతిపత్రాలను అందించారు. ముక్కామలలో పీహెచ్‌సీఉంది. ఈపీహెచ్‌సీ భవనంలో రెండు గదులు ఉన్నాయి. మందులు భద్రపర్చడానికి, ల్యాబ్ నిర్వహించడానికి, రోగులను పరీక్షించడానికి గదులు సరిపడక వైద్యులు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. ముక్కామలలో పీహెచ్‌సీ నిర్మించేందుకు రూ.1.20కోట్లు మంజూరయ్యాయి. అయితే స్థానిక హైస్కూల్ క్రీడా ప్రాంగణానికి సంబంధించిన స్థలాన్ని కేటాయించారు. అయితే హైస్కూల్ స్థలంలో ఎటువంటి నిర్మాణం చేపట్టకూడదని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేయడంతో నిధులు వెనక్కి వెళ్లిపోయాయి. ఈపీహెచ్‌సీలో ఏడు గ్రామాల్లోని 25వేలమంది వైద్య సేవలు పొందుతున్నారు. నిరుపయోగంగా ఉన్న వసతి గృహాన్ని పీహెచ్‌సీకి కేటాయించాలని ఆయా గ్రామస్థులు కోరుతున్నారు.




పుల్లేటికుర్రులో నిరుపయోగంగా ఉన్న బీసీ బాలుర వసతి గృహం, వైద్య సేవలకు సరిపడని ముక్కామల పీహెచ్‌సీ భవనం

లైసెన్స్డ్ సర్వేయర్ల సంఘ సమావేశం

నూతన కార్యవర్గం ఎన్నిక


శ్యామ్‌కుమార్

ముమ్మిడివరం, జూలై 16: లైసెన్స్‌డ్ సర్వేయర్లకు ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా లైసెన్స్‌డ్ సర్వేయర్ల సంఘ సమావేశం డిమాండు చేసింది. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలో పోలమ్మ చెరువుగట్టున బి.శ్రీనివాసరావు అధ్యక్షతన మంగళవారం లైసెన్స్‌డ్ సర్వేయర్ల సంఘ సమావేశం జరిగింది. సమావేశంలో సర్వేయర్లు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చర్చించారు. అనంతరం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా గోరింకల శ్యామ్‌కుమార్, గౌరవాధ్యక్షుడిగా ఎం.సురేష్, ఉపాధ్యక్షుడిగా వెంకటేష్, కార్యదర్శిగా పాటి రాంబాబు, కోశాధికారిగా వినోద్‌కుమార్, సంయుక్త కార్యదర్శిగా వివేక్‌లతో పాటు సలహాదారు కమిటీ సభ్యులు ఎంఎవీ ప్రసాద్, అప్పన బాబు, బి.సతీష్, పి.సత్తిబాబు, సంతోష్, బెంజ్‌మెన్, శ్రీనివాస్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని పలువురు అభినందించారు.

వరద ప్రభావిత ప్రాంతాల పరిశీలన

అల్లవరం, జూలై 16: మండలంలోని వైనతేయ వరద ప్రభావిత ప్రాంతాలైన బోడసకుర్రు పల్లిపాలెం, గోపాయిలంక, బెండమూర్లంక, రెబ్బనపల్లి, ఓడలరేవు మన్నా కాలనీలను తహసీల్దారు పి.సునీల్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. అల్లవరంలో కౌశిక డ్రెయిన్ వల్ల ముంపేవాటిల్లే ప్రాంతాలపై తహసీల్దారును ఆరా తీశారు. ఆయన వెంట సర్పంచ్ బర్రే సీతారత్నం, చిట్టినీడి శ్రీనివాస్, రొక్కాల నాగేశ్వరరావు, ఆర్ఐ మేడిద దుర్గాశ్రీనివాస్, వీఆర్వోలు గెద్దాడ సత్యనారాయణ, మాచిరాజు ఉల్లిష్, ఎస్.శ్రీనివాస్, మెట్ల బాలసుబ్రహ్మణ్యం వున్నారు.

మెరుగైన వైద్య సేవలందించండి



ఉప్పలగుప్తం, జూలై 16: పీహెచ్‌సీ పరిధిలోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు వైద్యులకు సూచించారు. ఎస్.యానాం ఆరోగ్య కేంద్రం వైద్యులు టి.దివ్యశ్రీ, అనిల్‌కుమార్ మంగళవారం ఎమ్మెల్యేను కలిసి పుష్పగుచ్ఛాలతో అభినందించారు. ఆసుపత్రి అంశాలపై ఎమ్మెల్యే ఆరా తీశారు. కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య విస్తరణాధికారి విప్పర్తి వరప్రసాదరావు, ఫార్మసిస్టు మీనాక్షి, ల్యాబ్ టెక్నీషియన్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

నిధులు దుర్వినియోగంపై పూర్తిస్థాయిలో విచారణ చేయాలి


మొగలికుదురు పంచాయతీ కార్యాలయం ఎదుట స్థానికుల ఆందోళన

మామిడికుదురు, జూలై 16: మొగలికుదురు పంచాయతీ నిధులు దుర్వినియోగంపై పూర్తిస్థాయిలో విచారణ చేయాలని గ్రామస్థులు మంగళవారం పంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. నిధుల దుర్వినియోగంపై పంచాయతీ ఉపసర్పంచ్ గనసాల దీపిక, పాలకమండలి సభ్యుల ఫిర్యాదు చేసిన నేపథ్యంలో అమలాపురం డీఎల్పీవో పి.బొజ్జిరాజు మంగళవారం విచారణకు వచ్చారు. స్థానికులు దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేయాలని అమలాపురం డివిజన్‌కు సంబంధించిన అధికారి కాకుండా వేరే డివిజన్‌కు చెందిన అధికారితో విచారణ చేయించాలని డిమాండు చేశారు. అనంతరం డీఎల్పీవో మాట్లాడుతూ దీనిపై విచారణ వచ్చే సోమవారం చేస్తామని చెప్పారు. ఈనేపథ్యంలో స్థానికులకు, సర్పంచ్‌కు వాగ్వివాదం జరిగింది. అనంతరం స్థానికులు పంచాయతీ కార్యాలయం ఎదుట నిధుల దుర్వినియోగానికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండు చేస్తూ ఆందోళన చేపట్టారు. ఉపసర్పంచ్ గనసాల దీపిక మద్దింశెట్టి అబ్బు, పోతు కాశి, దొంగ సత్తిబాబు, సాధనాల రమేష్, పెనుమాల లక్ష్మి, జీవీ, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి చెస్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపిక


రాష్ట్రస్థాయి చెస్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

అమలాపురంటౌన్, జూలై16: చెస్ అసోసియేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో అమలాపురం విద్యానిధి విద్యా సంస్థల ప్రాంగణంలో జూనియర్స్ స్థాయి చెస్ పోటీలను మంగళవారం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. రాష్ట్ర స్థాయి పోటీలకు నలుగురు బాలురు, నలుగురు బాలికలను ఎంపిక చేసినట్టు జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి తాడి వెంకటసురేష్ తెలిపారు. బాలుర విభాగంలో ద్రాక్షారపు సాత్విక్ ప్రథమ స్థానంతో చాంపియన్‌గా నిలిచాడు. బండారు నానిబాబు(ద్వితీయ), తోలేటి శ్రీకాంత్(తృతీయ), కొండా శివేంద్ర(చతుర్థ) స్థానాల్లో నిలిచారు. బాలికలవిభాగంలో గుత్తుల వైష్ణవి ప్రథమ స్థానంతో చాంపియన్‌గా నిలిచింది. నూకపెయ్యి హన్విక (ద్వితీయ), జాన్ బ్లెస్సీ(తృతీయ), పణిశెట్టి ధరణి(చతుర్థ) స్థానాలు సాధించారు. వీరు ఈనెల18నుంచి నంద్యాలలోజరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు. విజేతలకు విద్యానిధి విద్యా సంస్థల చైర్మన్ ఏబీ నాయుడు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు.

భక్తుల మనోభావాలు దెబ్బతీసే వారిపై చర్యలు తీసుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణారెడ్డి

రావులపాలెం, జూలై16: ఎవరి మతాన్ని వారు గౌరవించుకోవాలని, భక్తుల మనోభావాలు దెబ్బతీసే విధంగా ప్రవర్తించే వారిపై పోలీసులు చర్యలుతీసుకోవాలని బీజేపీ రాష్ట్ర పదాధికారి, గుంటూరు జిల్లా ఇన్‌చార్జి తమనంపూడి రామ కృష్ణారెడ్డి కోరారు. రావులపాలెంలోని బీజేపీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు భక్తులు వేలాదిగా తరలివస్తున్నారన్నారు. ఈనెల13న కొంత మంది ఓ మతానికి చెందిన బోర్డులను పట్టుకుని ప్రచారం చేయడం దారుణమన్నారు. దీంతో హిందూ భక్తులు ఇబ్బందులు ఎదు ర్కొరన్నారు. సమాచారం అందించిన వెంటనే పోలీసులు వచ్చి చర్యలు తీసుకోవడంతో ఎటువంటి వివాదం జరగలేదన్నారు. ఇటువంటివి పునరావృతం కాకుండాచూడాలన్నారు. కోప్పూరి వెంకటకృష్ణారెడ్డి, మంచిగట్ల కృష్ణ, ఈశ్వరరెడ్డి, భాస్కరరెడ్డి పాల్గొన్నారు.

సుబ్బాలమ్మ జాతర మహోత్సవం

అమలాపురం టౌన్, జూలై 16: అమలాపురం పండ్ల వర్తక సంఘం ఆధ్వర్యంలో గ్రామదేవత శ్రీసుబ్బాలమ్మ అమ్మవారి జాతరను మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఆషాడం పురస్కరించుకుని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. సుబ్బాలమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. తిరుమనాథం అంజి ఆధ్వర్యంలో భక్తులకు పులిహోర వితరణ చేశారు. పండ్ల వర్తక వ్యాపారులు పాల్గొన్నారు.

జిల్లా ప్రధాన న్యాయమూర్తిని కలిసిన కలెక్టర్



అమలాపురం టౌన్, జూలై 16: రాజమహేంద్రవరంలోని జిల్లా కోర్టు కార్యాలయంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీతను డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమర్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

ఏయూ దూరవిద్యా డైరెక్టర్‌కు ప్రజాహిత పురస్కారం

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూలై 16: ఆంధ్రా యూనివర్సిటీ దూరవిద్యా డైరెక్టరు ఎస్.విజయమోహన్‌కు మంగళవారం మోడరన్ విద్యా సంస్థల అధినేత లయన్ జీ.వి.రావు ప్రజాహిత పురస్కారాన్ని అందజేశారు. విజయమోహన్ నేతృత్వంలో ఏయు దూరవిద్య విభాగం మరింత విశేషమైన సేవలు అందించాలని ఆభిలాషించారు.

గ్రామ సమస్యలను పరిష్కరించండి

ఉప్పలగుప్తం, జూలై16: తమ గ్రామ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సన్నవిల్లికి చెందిన కూటమినాయకులు, కార్యకర్తలు మంగళవారం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావుకు వినతిపత్రంసమర్పించారు. వైసీపీ పాలనలో గ్రామాభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని ఆందోళన వ్యక్తం చేశారు. సర్పంచ్ చిక్కం జంగమయ్యతోపాటు కూటమి నాయకులు పాల్గొన్నారు.

ర్యాలిలో తాగునీటికి ఇబ్బంది

ఆత్రేయపురం, జూలై 16: మేజర్ గ్రామమైన ర్యాలిలో మంచినీటి పథకం నెల నుంచీ మొరాయించింది. దీంతో తాగునీటి కోసం వేలాది మంది ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. గుక్కెడు నీటి కోసం పడరాని పాట్లు పడుతున్నారు. విద్యుత్ త్రిఫేజ్ సప్లై అందించకపోవడంతో పాటు మోటార్లు పాడైపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. గ్రామ పంచాయతీకి వెళ్లి సమస్యను విన్నవించినా ఎవరూ పట్టించుకున్న దాఖలాలు లేవు.

అల్లవరంలో పీరు ఊరేగింపు

అల్లవరం, జూలై 16: అల్లవరం పీర్ల పంజా నుంచి సోమవారం రాత్రి నగరం వెళ్లిన పవిత్ర పీరు తిరిగి మంగళవారం చేరుకుంది. అల్లవరం పీరును గ్రామంలో డప్పులతో ఊరేగించారు. ముజావర్ది షేక్ గౌషియా ఆధ్వర్యంలో పవిత్ర పీరుకు ధూపం వేసి ప్రార్థనలు చేశారు. పంజాలోని పవిత్ర పీరుకు హిందువులు, ముస్లింలు పూజలు చేశారు. కార్యక్రమంలో షేక్ మొల్లాజానీ తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరమణ	: ఓఎంజీ
శ్రీలలిత	: సారంగ దరియా
శేఖర్ స్క్రీన్-1	: కల్కి
శేఖర్ స్క్రీన్-2	: ---
రమా	: భారతీయుడు 2
గణపతి	: రౌడీ గ్యాంగ్
వెంకటపద్మావతిస్క్రీన్-1	: కల్కి
వెంకటపద్మావతి స్క్రీన్-2	: ---

ఆధార్‌కార్డు అప్‌డేట్ తప్పనిసరి

అంబాజీపేట,జూలై16: మండలంలోని ప్రతిఒక్కరూ ఆధార్‌కార్డును అప్‌డేట్ తప్పనిసరిగా చేయించుకోవాలని ఎంపీడీవో సరోవర్ తెలిపారు. ఈనెల23 నుంచి 27వరకు ఆయా గ్రామాల్లో ఉన్న సచివాలయాల వద్ద నిర్వహించే ఆధార్ అప్‌డేట్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. 23న పుల్లేటికుర్రు -1,2, చిరతపూడి, తొండవరం గ్రామాలు, 24న కె.పెదపూడి, ఇసుకపూడి, వాకలగరువు, 25న పసుపల్లి, మాచవరం-1, 2, నందంపూడి, 26న ముక్కామల, వక్కలంక, మాచవరం -3, 4, గంగలకుర్రు అగ్రహారం, 27న ఇరుసుమండ, మొసలపల్లి గంగలకుర్రు గ్రామాల్లో ఆధార్ అప్‌డేట్ చేస్తారన్నారు.

తాగునీటి ట్యాంకులు శుభ్రంగా ఉంచాలి

అంబాజీపేట, జూలై16: రక్షిత మంచినీటి ట్యాంకులను శుభ్రంగా ఉంచాలని సెంట్రల్ టీమ్ ప్రతినిధులు పేర్కొన్నారు. మాచవరం, తొండవరం, పసుపల్లి తదితర గ్రామాల్లో జలజీవన్‌మిషన్ పథకం ద్వారా అందించే తాగునీటి పైపులైన్లు పరిశీలించారు. తాగునీరు నమూనాలను సెంట్రల్ టీమ్ ప్రతినిధులు సేకరించారు. ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ చలమయ్య, సర్పంచ్‌లు నాగాబత్తుల శాంతకుమారి, పేరాబత్తుల దొరబాబు, నాయకులు నాగాబత్తుల వెంకటసుబ్బారావు, గోసంగి సత్యనారాయణ, కుసుమే విజయకుమారి తదితరులు ఉన్నారు.

రోడ్డును ఆధునికీకరించాలని వినతి

ముమ్మిడివరం, జూలై16: ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని 19వ వార్డు దొమ్మేటివారిపాలెంలోని రోడ్డును ఆధునికీకరించాలని ఆ వార్డు ప్రజలు కోరుతున్నారు. దొమ్మేటివారిపాలెం నుంచి క్రాప చింతలపూడిపాలెం వెళ్లే 450మీటర్ల రోడ్డు గుంతలు పడి అధ్వానంగా మారింది. 9వవార్డు కౌన్సిలర్ కడలి సౌజన్య, టీడీపీ నాయకులు కొండబాబు, డి.శ్రీరామ్‌కిరణ్, సత్తిబాబు, డి.ఏడుకొండలుతో పాటు పలువురు మంగళవారం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజును కలిసి రోడ్డు మరమ్మతు పనులకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై ఎమ్మెల్యే స్పందించి నగరపంచాయతీ కమిషనర్ జి.వెంకట్రామిరెడ్డితో మాట్లాడి రోడ్డు మరమ్మతులకు చర్యలు చేపడతామని వారికి హామీ ఇచ్చారు.

విద్యతోనే రాష్ట్రాభివృద్ధి: సర్పంచ్ సాకా

కపిలేశ్వరపురం, జూలై 16: విద్యతోనే రాష్ట్రం, దేశాభివృద్ధి సాధ్యమని గ్రామ సర్పంచ్ సాకా శ్రీనివాస్ అన్నారు. మంగళవారం కపిలేశ్వరపురం దేవీసెంటర్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన స్టూడెంట్స్ కిట్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం సర్పంచ్ శ్రీనివాస్, ఎంఈవో కె.తాతారావు విద్యార్థులకు విద్యాకిట్లను అందజేశారు. పాఠశాల హెచ్ఎం అంబటి శ్రీనివాస్, ఉపాధ్యాయులు అగస్తేశ్వరరావు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు ఏకలవ్యుడి జయంతి

రాయవరం, జూలై 16: రాయవరంలో బుధవారం ఏకలవ్య ఎరుకల సం ఘం ఆధ్వర్యంలో ఏకలవ్యుడు జయంతి నిర్వహించనున్నట్లు ఎరుకల సంఘం నాయకులు మంగళవారం తెలిపారు. ఏకలవ్యుడికి నివాళులర్పించిన అనంతరం ఎరుకల కులస్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చిస్తామన్నారు.

దోమలు వ్యాపించకుండా చర్యలు

పి.గన్నవరం, జూలై16: అంటువ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు మంగళవారం పి.గన్నవరం గ్రామపంచాయతీ పరిధి ప్రధాన వీధుల్లో దోమలు వ్యాపించకుండా ఫాగింగ్ చేశారు. సర్పంచ్ బొండాడ నాగమణి, కార్యదర్శి జి.వి.వి.కె. కుమార్ సూచనలు మేరకు ప్రధానసెంటర్‌తో పాటు డ్రైనేజీ వ్యవస్థ ఉన్నచోట ఫాగింగ్ చేశారు. పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

అనధికార కనెక్షన్లపై చర్యలు

అమలాపురం టౌన్, జూలై 16: పట్టణంలో అనధికార కుళాయి కనెక్షన్లపై కఠిన చర్యలు తీసుకోనున్నట్టు మున్సిపల్ కమిషనర్ ఎస్.మనోహర్ తెలిపారు. పట్టణంలో 200అక్రమ కుళాయిలను గుర్తించి వాటిలో ఇప్పటివరకు 70 క్రమబద్ధీకరించినట్టు వివరించారు. మిగతా కుళాయిలను వారంలోపు క్రమబద్ధీకరించుకోకుంటే ట్యాప్‌లు తొలగిస్తామని హెచ్చరించారు. పురపాలక సంఘ కార్యాలయంలో మంగళవారం ఇంజనీరింగ్ సిబ్బంది, వార్డు ఎమినిటీస్ కార్యదర్శులతో కమిషనర్ సమావేశం నిర్వహించారు. పైపులైన్ల లీకేజీలను గుర్తించి వెంటనే అరికట్టాలన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి


ఎమ్మెల్యే ఆనందరావుకు వినతిపత్రం అందజేస్తున్న వార్డు విద్యా కార్యదర్శులు

అమలాపురం టౌన్, జూలై 16: అమలాపురం పురపాలక సంఘంలో వార్డు ఎడ్యుకేషన్ కార్యదర్శులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. వార్డు కార్యదర్శులకు లైన్ డిపార్టుమెంట్ ఏర్పాటు చేయాలని, విద్యా శాఖలో కంప్యూటర్ బోధకులుగా గానీ, బోధనేతర సిబ్బందిగా గానీ నియమించాలని కోరారు. కంప్యూటర్ సైన్స్‌లో ఉన్నత చదువులు చదివినవారి సాంకేతిక పరిజ్ఞానాన్ని గుర్తించి ఇతర శాఖలకు అనుసంధానిస్తూ జూనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. వార్డు కార్యదర్శుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే ఆనందరావు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యవర్గ సభ్యుడు సుధాకర్, మురళి, దుర్గారావు, ప్రవీణ, చంద్రిక పాల్గొన్నారు.

చెరువుల తవ్వకాలను తక్షణం ఆపించండి

ఉప్పలగుప్తం, జూలై 16: పంట భూములను ఆక్వా చెరువులుగా మార్చి ప్రజా జీవనానికి హాని కలిగిస్తున్న వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని మంచెంవారిపాలెం, గంధంవారిపాలెం గ్రామస్థులు గంధం వెంకన్న, మంచెం బుజ్జి, చవ్వాకుల దుర్గారావు, గంధం సూర్యనారాయణ ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దారు, వ్యవసాయ శాఖ కార్యాలయాల్లో వినతిపత్రాలు సమర్పించారు. ఆక్వా సాగుతో భూగర్భ జలాలు కలుషితమై తాగునీటికి ఇబ్బందిపడుతున్నామని, కాలుష్యంతో రోగాలబారిన పడుతున్నామని వివరించారు. చెరువుల తవ్వకాలను తక్షణం అడ్డుకోవాలని కోరారు.

అన్నదాన భవన నిర్మాణానికి రూ.లక్ష విరాళం

ఆత్రేయపురం, జూలై 16: కోనసీమ తిరుమల వాడపల్లిలో వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి బిక్కవోలుకు చెందిన కోశెట్టి ఆనందరావు రూ.లక్ష విరాళం అందించారు. కొత్తతుంగపాడుకు చెందిన దొడ్డా వెంకటలక్ష్మి రూ.12,116 విరాళం సమర్పించారు. మాజీ ఎమ్మెల్యే మంతెన సుబ్బరాజు తనయుడు కృష్ణంరాజు మంగళవారం స్వామివారిని దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.1,76,336 లభించినట్టు ఆలయ ఉప కమిషనరు, ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు.

అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి

ఆలమూరు, జూలై 16: సీజనల్‌గా వచ్చే అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో ఎం.సుమలత వైద్య సిబ్బందికి సూచించారు. మంగళవారం ఆమె పెదపళ్ల పీహెచ్‌సీ పరిధిలోని వైద్య సిబ్బందితో సమీక్షించారు. పలు ప్రాంతాల్లో డయేరియా విస్తరిస్తోందని, దీనిపై ప్రజలకు అవగాహన కల్పించి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఆసుపత్రిలో వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో వైద్యాధికారి పి.భవానీశంకర్, డాక్టర్ డి.సాయికిషోర్, హెల్త్ ఎడ్యుకేటర్ రాజా ఆకుల, సీహెచ్‌వో రాధాకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం అందజేత

ముమ్మిడివరం, జూలై 16: కర్రివానిరేవు గ్రామ పంచాయతీ పరిధిలోని తోట్లపాలేనికి చెందిన ఆకుమర్తి నాగేంద్రప్రసాద్-శాంతికుమారి దంపతులు కుమార్తె జ్యోతి అరుదైన వ్యాధితో బాధపడుతూ మంచానికి పరిమితమైంది. ముమ్మిడివరం షెడ్యూల్డు కులాల సంక్షేమ సంఘం సభ్యులు మంగళవారం వైద్యుల ఖర్చులకు ఆమెకు రూ.20వేలు అందించారు. కార్యక్రమంలో మట్టా శ్రీనివాసరావు, జనిపల్లి సత్యనారాయణ, కాశి వెంకటాచార్య, కటికదల రాము, నక్కా శ్రీనివాస్, పాము ఆనందరావు, బుడితి వెంకటేశ్వర్లు, కాశి బాబాయ్, బి.బాబూరావు, ఎం.లక్ష్మణ్‌కుమార్, కాశి జగపతి, జె.భైరవస్వామి పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎన్‌జీవో అసోసియేషన్ నాయకులు



కపిలేశ్వరపురం, జూలై 16: కలెక్టర్ డాక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌ను మంగళవారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఏపీఎన్‌జీవో అసోసియేషన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. అసోసియేషన్ అధ్యక్షుడు గుద్దటి రామమోహనరావు, ప్రధాన కార్యదర్శి పేపకాయల వెంకటకృష్ణ, పారా మెడికల్ అసోసియేషన్ రాష్ట్రప్రధాన కార్యదర్శి మాధవరపు వెంకటేశ్వర్లు, అమలాపురం, కొత్తపేట, రాజోలు, మండపేట, రామచంద్రపురం యూనిట్ అధ్యక్షులు సీహెచ్.రాజశేఖర్, మోటూరి రామారావు, డి.సుబ్రహ్మణ్యం, జె.మల్లికార్జునుడు, చిక్కాల సూర్యారావు, ప్రధానకార్యదర్శులు పి.కోదండరామయ్య, వెంకటరామారావు, ఐ.ప్రతాప్‌రాజు, టి.ఇమ్మానియేలు కలెక్టర్‌నుకలిసి ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. రాష్ట్రంలో కోనసీమ జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపేందుకు కృషిచేస్తామని అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తెలిపారు.

మద్యం విక్రేత అరెస్టు

ఆలమూరు, జూలై 16: ఆలమూరు ఎస్ఈబీ స్టేషన్‌కు అందిన ఫిర్యాదు మేరకు మండపేట గొల్లపుంతకు చెందిన డి.శివలింగేశ్వరరావు ఇంటిపై దాడి చేశారు. అక్రమంగా నిల్వ ఉంచి అధిక ధరలకు అమ్ముతున్నట్టు గుర్తించి అతడిని అరెస్టుచేసి కేసు నమోదు చేసినట్టు ఎస్ఈబీ ఎస్ఐ ఎ.సత్యవాణి చెప్పారు. అతడి వద్ద నుంచి 19మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఆలమూరు ఎస్ఈబీ స్టేషన్ పరిధిలోని ఆలమూరు, మండపేట, కపిలేశ్వరపురం మండలాల్లో అక్రమ మద్యం, నాటుసారా విక్రయాలు జరుగుతున్నట్టు సమాచారం అందిస్తే చర్యలు తీసుకుంటామని సత్యవాణి చెప్పారు.

రేపు వాహనదారుల రక్షణ కోసం ర్యాలీ

అమలాపురం టౌన్, జూలై 16: కేంద్ర ప్రభుత్వం అమలులోకి తీసుకువచ్చిన కేంద్ర మోటారు వాహన చట్టంలోని 167(ఎ) నిబంధనను కఠినంగా అమలు చేయనుంది. ద్విచక్ర వాహనచోదకులు తీసుకోవాల్సిన రక్షణ చర్యలపై గురువారం అమలాపురం కోర్టు ప్రాంగణం వద్ద నుంచి గడియార స్తంభం సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించనున్నట్టు అమలాపురం రెండో అదనపు జిల్లా జడ్జి వి.నరేష్ తెలిపారు. ద్విచక్ర వాహనచోదకులు హెల్మెట్ ధరించకపోతే కలిగే నష్టాలను వివరిస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకురావడమే ర్యాలీ ఉద్దేశ్యమని న్యాయమూర్తి తెలిపారు.